

ఎస్సారెస్పీ 26 గేట్లు ఓపెన్

జగిత్యాలఅగ్రికల్చర్: ఎస్సారెస్పీకి ఎగువ 1.11 లక్షలక్యూసెక్కుల నీరు వస్తుండగా 26 గేట్లు ఎత్తి 1,01,480 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.



స్థానికంలో కాసుల గోల

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలుబడటంతో పోలీసులు అప్రమత్తమైయ్యారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

మంత్రి 'పొన్నం' క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న దుమాల గంగారాం

జగిత్యాలటౌన్/ధర్మపురి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం అన్నారు. జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మాదిగల ఆత్మగౌరవం దెబ్బతీసేలా సహచర మంత్రి అడ్లూరిని కించపరిచేలా పొన్నం మాట్లాడడం సరికాదన్నారు. 24గంటల్లో క్షమాపణ చెప్పకుంటే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పొన్నం దిష్టిబొమ్మలు దహనం చేస్తామని హెచ్చరించారు. ధర్మపురి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చెందోలి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మాదిగల ఆత్మగౌరవం దెబ్బతీసేలా వ్యవహరించిన పొన్నం తీరు సరికాదన్నారు.

దుర్భాషలాడిన వారిపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందిస్తున్న వైద్యులు

జగిత్యాల: ఆస్పత్రుల్లో వైద్యులపై కొందరు చికిత్స కోసం వచ్చి దుర్భాషలాడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్‌కు ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందించారు. మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధి నిర్వహణలో ఉన్న వైద్యులపై అనుచితంగా ప్రవర్తించారని, ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా చూడాలన్నారు. ఈ ఘటనలతో వైద్య సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారన్నారు. వైద్యులు శశికాంత్‌రెడ్డి, నవీన్, అమరేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు రక్షణ కరువైంది



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: జగిత్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలకు రక్షణ కరువైందని, పోలీస్ యంత్రాంగమే తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. బాలెపల్లి రేవంత్‌రెడ్డిపై గంగారెడ్డి అనుచరులు రాళ్లతో దాడులు చేయగా.. కార్తీక్ అనే మధ్యవర్తికి తగిలిందని, రేవంత్‌రెడ్డిపై దాడి చేస్తున్నారని, శాంతిభద్రతలు కాపాడాలని పోలీసులకు సమాచారం ఇచ్చినా.. ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన రేవంత్‌రెడ్డినే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం దారుణమన్నారు. అతడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారన్నారు. ఈ ఘటనలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డీజీపీ, సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఆర్టీసీలో రెట్టింపు చార్జీ వసూలు

- కోరుట్ల నుంచి వేములవాడకు టికెట్ ధర రూ.60
- దౌర్జన్యంగా రూ.120 వసూలు చేసిన బస్ కండక్టర్
- డిపో అధికారుల తీరుపై ప్రయాణికుల ఆగ్రహం



సిరికొండ నుంచి వేములవాడకు రూ.120 తీసుకున్న టికెట్

కథలాపూర్: కోరుట్ల నుంచి వేములవాడకు ఆర్టీసీ బస్ చార్జి రూ.60. కానీ.. కోరుట్ల డిపోకు చెందిన ఓ బస్ కండక్టర్ మండలంలోని సిరికొండకు చెందిన ప్రయాణికుడు గుండేటి రాజు నుంచి రూ.120 తీసుకున్నారు. ఇదేమిటని అడిగితే కోరుట్ల డిపో అధికారులు చెప్పడంతోనే తాను వసూలు చేస్తున్నట్లు కరాఖండీగా చెప్పాడు. రాజుతోపాటు ప్రయాణికులు వారించినా వినిపించుకోలేదు. విషయాన్ని రాజు కోరుట్ల డిపో అధికారులకు ఫోన్‌లో తెలపగా.. పొంతనలేని సమాధానమిచ్చారు. రాజు తిరుగు ప్రయాణంలో వేములవాడ నుంచి సిరికొండకు వేములవాడ డిపో బస్సులో వెళ్లగా కండక్టర్ మాత్రం రూ.60 తీసుకున్నాడు. రెట్టింపు చార్జి వసూలుపై కోరుట్ల ఆర్టీసీ డిపో అధికారులను వివరణ కోరగా.. ఒక బస్సు ట్రిప్పులో ఎక్కువ ధర తీసుకున్న మాట నిజమేనని, మిగిలిన బస్సుల్లో పెంచలేదని తెలిపారు.

'పరిషత్' ఏర్పాట్లు ముమ్మరం

- రెండు విడతల్లో నిర్వహణ
- కసరత్తు చేస్తున్న అధికారులు
- ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ పూర్తి

ఫేస్–1 పోలింగ్:
10 జెడ్పీటీసీ, 108 ఎంపీటీసీ స్థానాలు
పోలింగ్ కేంద్రాలు: 554
మండలాలు: బీర్‌పూర్, రాయికల్, సారంగాపూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మెట్‌పల్లి, భీమారం, కథలాపూర్, కోరుట్ల, మేడిపల్లి

ఫేస్–2 పోలింగ్
10 జెడ్పీటీసీ, 108 ఎంపీటీసీ స్థానాలు
పోలింగ్ కేంద్రాలు: 569
మండలాలు: బుగ్గారం, ధర్మపురి, ఎండపల్లి, జగిత్యాల, జగిత్యాల రూరల్, కొడిమ్యాల, మల్యాల, పెగడపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి

ఫేస్-1	ఫేస్-2
నోటిఫికేషన్ విడుదల: 9న	నోటిఫికేషన్ విడుదల: 13న
పోలింగ్: అక్టోబర్ 23	పోలింగ్ : అక్టోబర్ 27
కౌంటింగ్: నవంబర్ 11	కౌంటింగ్ : నవంబర్ 11



కౌంటింగ్ కేంద్రాలు

- ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో: జగిత్యాల, జగిత్యాలరూరల్, కొడిమ్యాల, మల్యాల, ధర్మపురి, బుగ్గారం
- కండ్లపల్లి మోడల్‌స్కూల్‌లో: రాయికల్, సారంగాపూర్, బీర్‌పూర్
- ఇబ్రహీంపట్నం మోడల్‌స్కూల్‌లో మల్లాపూర్, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం కల్లూరు మోడల్‌స్కూల్‌లో కోరుట్ల, భీమారం, మేడిపల్లి
- గొల్లపల్లి మోడల్‌స్కూల్‌లో: గొల్లపల్లి, పెగడపల్లి, వెల్గటూర్, ఎండపల్లి

జగిత్యాల: జిల్లా, మండల పరిషత్ ఎన్నికల దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి విడత బీర్‌పూర్, రాయికల్, సారంగాపూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మెట్‌పల్లి, భీమారం, కథలాపూర్, కోరుట్ల, మేడిపల్లి మండలాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. రెండో విడత బుగ్గారం, ధర్మపురి, ఎండపల్లి, జగిత్యాల, జగిత్యాలరూరల్, కొడిమ్యాల, మల్యాల, పెగడపల్లి, వెలగటూర్, గొల్లపల్లి మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో మొదటగా పరిషత్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జెడ్పీటీసీ రిజర్వేషన్ వివరాలు ఇలా..

బీర్‌పూర్ (ఎస్టీ జనరల్), ఎండపల్లి, మల్యాల (ఎస్సీ మహిళ), కొడిమ్యాల, గొల్లపల్లి (ఎస్సీ జనరల్), పెగడపల్లి, జగిత్యాల, భీమారం, మేడిపల్లి (బీసీ మహిళ), రాయికల్, కోరుట్ల, వెల్గటూర్, సారంగాపూర్, మెట్‌పల్లి, బుగ్గారం (బీసీ జనరల్), బుగ్గారం, మల్లాపూర్, కథలాపూర్ (జనరల్ మహిళ), ఇబ్రహీంపట్నం, ధర్మపురి, జగిత్యాల రూరల్ (జనరల్)కు కేటాయించారు.

ఎంపీపీ రిజర్వేషన్ల వివరాలు ఇలా..

బీర్‌పూర్ (ఎస్టీ జనరల్), ఎండపల్లి, బుగ్గారం (ఎస్సీ మహిళ), కొడిమ్యాల, మల్యాల (ఎస్సీ జనరల్), రాయికల్, భీమారం, గొల్లపల్లి, కోరుట్ల (బీసీ మహిళ), పెగడపల్లి, జగిత్యాల, మేడిపల్లి, వెల్గటూర్ (బీసీ జనరల్), ధర్మపురి, మెట్‌పల్లి, జగిత్యాలరూరల్ (జనరల్ మహిళ), సారంగాపూర్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కథలాపూర్ (జనరల్) స్థానాలుగా ఖరారయ్యాయి. మొదటి దశ పోలింగ్‌కు ఈనెల 9న నోటిఫికేషన్ రానుండగా.. ఈనెల 23న పోలింగ్, నవంబర్ 11న కౌంటింగ్ చేపట్టనున్నారు. అలాగే రెండో దశకు ఈనెల13న నోటిఫికేషన్ విడుదల కానుండగా.. ఈనెల 27న పోలింగ్, నవంబర్ 11 కౌంటింగ్ జరగనుంది. ఈ మేరకు ఇప్పటికే ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ కల్పించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పూర్తి అవగాహన కల్పిస్తున్నారు.

బ్రాండెడ్ పేరిట నకిలీ వస్తువులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఎలక్ట్రికల్ వైర్లు. ఓ బ్రాండెడ్ కంపెనీ పేరిట విక్రయిస్తున్నారు. వాస్తవానికి ఈ వైర్ నకిలీ. ఇటీవల మెట్‌పల్లిలోని ఓ దుకాణంలో పోలీసులు తనిఖీలు చేయగా అసలు విషయం వెలుగుచూసింది. సదరు వైర్ బెండిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సదరు కంపెనీ ప్రతినిధి ఫిర్యాదుతో నకిలీ వస్తువులు విక్రయిస్తున్న వ్యాపారిపై కేసు నమోదు చేశారు. ఇలా ఈ ఒక్క దుకాణంలోనే కాదు.. జిల్లాలోని చాలా దుకాణాల్లో నకిలీ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు.

- జిల్లాలో విచ్చలవిడిగా విక్రయం
- మెట్‌పల్లిలో పట్టుబడిన 37 వైర్ బెండిల్స్
- వ్యాపారిపై కేసు నమోదు చేసిన పోలీసులు

మెట్‌పల్లి: జిల్లాలో బ్రాండెడ్ కంపెనీల పేర్లతో వ్యాపారులు నకిలీ ఎలక్ట్రికల్ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. అధిక లాభాల కోసం వీటిని ప్రజలకు అంటగడుతూ భారీగా మోసాలకు పాల్పడుతున్నారు. తరచూ తనిఖీలు చేసి ఇలాంటి మోసాలను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా పలువురు వ్యాపారులు నకిలీ ఉత్పత్తులను దర్జాగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

జరుగుతోందిలా..

- జిల్లాలో ఎలక్ట్రికల్ వైర్లు, స్విచ్‌లు తదితర ఉత్పత్తులను పలు బ్రాండెడ్ కంపెనీలు సరఫరా చేస్తున్నాయి.
- బ్రాండెడ్ కంపెనీల ఉత్పత్తులను విక్రయిస్తే వ్యాపారులకు లాభాలు తక్కువగా ఉంటాయి.
- దీనిని ఆసరాగా చేసుకుంటున్న కొందరు అవే కంపెనీల పేరిట నకిలీ ఉత్పత్తులను తయారు చేసి వ్యాపారులకు అందిస్తున్నారు.
- వీటిని వ్యాపారులు బ్రాండెడ్ కంపెనీకి చెందినవిగా నమ్మిస్తూ ప్రజలకు విక్రయిస్తున్నారు.
- ఉదాహరణకు: మార్కెట్‌లో బాగా చెలామణిలో ఉన్న ఓ బ్రాండెడ్ కంపెనీకి చెందిన 1.0 గేజ్ వైర్ బెండిల్‌ను విక్రయిస్తే వ్యాపారులకు రూ.100 నుంచి రూ.150 వరకు లాభం వస్తుంది. అదే కంపెనీ పేరుతో ఉన్న నకిలీది అమ్మితే రెట్టింపు లాభం దక్కుతుంది.
- ఇలా పలు నకిలీ ఉత్పత్తులపై అధిక లాభాలు వస్తుండడంతో వ్యాపారులు ఎక్కువగా వాటినే విక్రయిస్తున్నారు.

తనిఖీలు శూన్యం..

- మార్కెట్లో నకిలీ ఉత్పత్తులు చెలామణి కాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉంటుంది.
- ముఖ్యంగా నకిలీ ఎలక్ట్రికల్ ఉత్పత్తులు కొంతకాలంగా జిల్లాలో విచ్చలవిడిగా వ్యాపారులు విక్రయిస్తున్నప్పటికీ అధికారులు అరికట్టడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- ఇప్పటివరకు జిల్లాలోని ఎలక్ట్రికల్ దుకాణాల్లో తనిఖీలు జరిపిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.
- దీనివల్ల పలువురు వ్యాపారులు నకిలీ ఉత్పత్తులను దర్జాగా విక్రయిస్తూ పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు.
- ఉన్నతాధికారులు స్పందించి నకిలీ ఎలక్ట్రికల్ ఉత్పత్తులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టుబడిందిలా..

- మెట్‌పల్లి పట్టణంలో ఓ బ్రాండెడ్ కంపెనీకి చెందిన నకిలీ వైర్లు విక్రయిస్తున్నారని ఆ కంపెనీ ప్రతినిధికి సమాచారం అందింది.
- ఆయన స్థానికంగా ఉన్న ఓ ఎలక్ట్రికల్ దుకాణానికి వెళ్లి ఆ కంపెనీ వైర్లు ఇవ్వాలని అడిగాడు. దీనికి సదరు వ్యాపారి ఆ కంపెనీ పేరుతో ఉన్న నకిలీ వైర్లను చూపాడు. వీటిని పరిశీలించిన ప్రతినిధి.. అది నకిలీదని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- వెంటనే ఎస్సై కిరణ్‌కుమార్ దుకాణంలో తనిఖీలు జరిపి రూ.1,17,360 విలువైన 37 నకిలీ వైర్ బెండిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యాపారిపై కేసు నమోదు చేశారు.

ఎన్నికల్లో లోటుపాట్లు రానీయొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్, పాల్గొన్న సిబ్బంది

- నామినేషన్ పత్రాలు జాగ్రత్తగా పరిశీలించాలి
- ఆర్వో, ఏఆర్వోలతో కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో లోటుపాట్లు జరగకుండా చూడాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో నామినేషన్ల స్వీకరణపై ఆర్వో, ఏఆర్వోలకు అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో ఎన్నికలు నిర్వహించాలని, అందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నామినేషన్లు తీసుకోవాలని, ప్రతి విషయాన్ని అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, అధికారులు, ఆర్వో, ఏఆర్వోలు పాల్గొన్నారు.

కారిడార్ అభివృద్ధికి డీపీఆర్ చేపట్టాలి: స్పెషల్ చీఫ్ సెక్రటరీ

గ్రీన్‌ఫీల్డ్ నాగ్‌పూర్, హైదరాబాద్ హైస్పీడ్ కారిడార్ అభివృద్ధికి డిటేయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) చేపట్టాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్‌తో సమీక్షించారు. జాతీయ రహదారుల మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు హైస్పీడ్ కారిడార్ అభివృద్ధికి డీపీఆర్ తయారుచేయాలన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. జిల్లాలో కొంతమేర కారిడార్ ఉన్న నేపథ్యంలో దాని ప్రకారం చేపడతామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్ ఉన్నారు.

యువత స్వయం ఉపాధి సమాజానికి మేలు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



జిపాక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: యువత స్వయం ఉపాధితో ముందుకెళ్లాలని, అది సమాజానికి మేలు అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాలకు చెందిన యువత అన్ని రకాల వస్తువులు ఆన్‌లైన్ ద్వారా డెలివరీ చేసేలా ఇటీవల జిపాక్ యాప్ రూపొందించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. యువత ఇలాంటివి ఆవిష్కరించాలన్నారు. అనంతరం సారంగాపూర్ మండలం అర్పపల్లికి చెందిన ప్రతిభ డీఎస్పీగా ఎంపికైన సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతిభ డీఎస్పీ పోస్టు సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. ధరూర్ క్యాంప్‌లోని ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం రోటరీ క్లబ్, ఆపి సంస్థ ఆధ్వర్యంలో వాటర్ ప్యూరిఫైర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ప్రారంభించారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కావాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్: స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధం కావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. మండలంలోని సిరికొండలో నిర్వహించిన మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ టికెట్ ఆశిస్తున్న వారి జాబితాను అధిష్టానానికి పంపించామన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు ఎండీ.అజీమ్, తొట్ల అంజయ్య, చెదలు సత్యనారాయణ, ఎండీ.హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ముహూర్తాలు లేవని..

- మద్యం షాపులకు అరకొరగా దరఖాస్తులు
- ఇప్పటివరకు వచ్చినవి ఏడు మాత్రమే..
- ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసిన అధికారులు



జగిత్యాలక్రైం: మద్యం షాపులకు టెండర్ల గడువు ఈనెల 18తో ముగియనుంది. గత నెల 27 నుంచే దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికీ దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో ఇప్పటివరకు కేవలం ఏడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. జిల్లాలోని మొత్తం 71 షాపులకు గతంలో కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. కానీ.. మంచి ముహూర్తాలు లేకపోవడంతో దరఖాస్తులు సమర్పించే వారు వెనుకంజ వేస్తున్నారు.

ఈనెల 8న భారీగా రానున్న దరఖాస్తులు

చాలారోజులుగా మంచి ముహూర్తాలు లేవు. ఈనెల 8న మంచి ముహూర్తం ఉండటంతో అదే రోజు మద్యంషాపులకు టెండర్లు వేసేందుకు దరఖాస్తుదారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గతంలో దరఖాస్తుకు రూ.2లక్షలు ఉండగా.. ప్రస్తుతం దానిని రూ.3 లక్షలకు పెంచారు. ఇది దరఖాస్తుదారుల్లో కొంత ఆందోళన కలిగిస్తోంది. పైగా దరఖాస్తు ఫీజు వాపస్ కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంపైనా తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం.

భారీగా ఏర్పాట్లు

మద్యంషాపులకు దరఖాస్తులు మందకొడిగా వస్తుండడం.. రానున్న రోజుల్లో భారీగా వచ్చే అవకాశం ఉండడంతో ఎక్సైజ్ శాఖ ఆ మేరకు ఏర్పాట్లు చేసుకుంటోంది. శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సెలవులను రద్దు చేశారు. ప్రతి అధికారి తప్పనిసరిగా కార్యాలయాల్లోనే ఉండి దరఖాస్తుదారులకు సూచనలు, సలహాలు ఇస్తూ.. దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు. ఈనెల 18న చివరి రోజు కావడంతో క్యూలైన్‌లో ఉన్న ప్రతి ఒక్కరి దరఖాస్తు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో చాలా మంది దరఖాస్తుదారులు ఈనెల 18నే దరఖాస్తులు సమర్పిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేయండి

- లేకుంటే ఆందోళనలు చేస్తాం
- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని, లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. పంట కోతకు వచ్చి రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్రాల ఏర్పాటులో జరుగుతున్న జాప్యంతో మార్కెట్‌లో వ్యాపారులు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2400 ఉంటే.. రూ.1800కు మించి చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వ వైఖరితో రైతులకు తీవ్రంగా నష్టం జరుగుతోందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో సకాలంలో కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకున్నామన్నారు. ఎన్నికలకు ముందు వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో జరిగిన సభలో పంటలకు మంచి ధరలను అందిస్తామని చెప్పిన కాంగ్రెస్, గద్దెనెక్కిన తర్వాత దానిని విస్మరించిందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే క్వింటాల్‌కు రూ.2800 చెల్లించి మొక్కజొన్న కొనుగోలు చేయాలన్నారు. కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేస్తే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎలాల దశరథరెడ్డి, నోముల లక్ష్మారెడ్డి, అంజిరెడ్డి, జేడీ.సుమన్, ఏలేటి చిన్నారెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజాగౌడ్ తదితరులున్నారు.

స్నేహానికి పసుపుకుంకుమ



జగిత్యాల: జిల్లాకేంద్రంలోని గోవిందుపల్లికి చెందిన మహిళలు సోమవారం తమ స్నేహానికి ప్రతిరూపంగా పసుపుకుంకుమలు, తమలపాకులు ఇచ్చిపుచ్చుకుని సనాతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. స్నేహానికి నాందిగా ఈ సంవత్సరం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. సనాతన పద్ధతిలో స్నేహితుల దినోత్సవం నిర్వహించుకునేలా కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

'బెస్ట్ అవెలబుల్' విద్యార్థుల ఆందోళన


- ఫీజు బకాయిలు విడుదల చేయాలని వినతి



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

జగిత్యాలటౌన్: చదువుకునేందుకు తమను పాఠశాలలోకి అనుమతించడం లేదంటూ బెస్ట్ అవెలబుల్ స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు జిల్లాకేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద జగిత్యాల, కరీంనగర్ రహదారిపై సోమవారం ఆందోళనకు దిగారు. బెస్ట్ అవెలబుల్ స్కూళ్లుగా గుర్తించిన కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాల్సి ఉంది. రెండేళ్లుగా నిధులు విడుదలకాకపోవడంతో ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థులను క్లాసులకు అనుమతించలేదు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ముందుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించారు. అక్కడ కాసేపు నిరసన తెలిపారు. అనంతరం రహదారిపై బైటాయించారు. బకాయిలు విడుదల చేసి పిల్లల విద్యాభ్యాసం నిలిచిపోకుండా చూడాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ ఎస్సై మల్లేశం వారికి సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు



భూషణరావుపేటలో ఓటరు జాబితాలో మరణించినవారి పేరు (సర్కిల్‌లో)

కథలాపూర్: ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలని, పొరపాట్లకు తావు ఇవ్వొద్దని ఎన్నికల అధికారులు సమావేశాలు నిర్వహించి చెప్తున్నా.. క్షేత్రస్థాయి అధికారుల, సిబ్బంది మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. ఏళ్ల క్రితమే మరణించిన వారి పేర్లు కూడా జాబితాలో కనిపించడం.. పలువురి పేర్లు తప్పుగా నమోదు కావడం.. కొందరికి రెండుచోట్లా ఓటు హక్కు ఉండడం సిబ్బంది పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. చనిపోయిన వారి పేర్లు జాబితాలో ఎలా ఉంటాయంటూ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కథలాపూర్‌లో వెలుగులోకి..

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల కోసం అధికారులు తుది ఓటరు జాబితా విడుదల చేశారు. ఒక జెడ్పీటీసీ, 13 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. మొత్తం 37,724 మంది ఓటర్లు ఉన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తయారుచేసిన ఓటరు జాబితాను రెవెన్యూ అధికారులు పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. వాటిని సదరు శాఖ అధికారులు ఎంపీటీసీ స్థానాల వారీగా ఒక జాబితా.. వార్డులవారీగా మరో జాబితా రూపొందించారు. వాటిని బీఎల్వోలతోపాటు పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు పరిశీలించాక తుది ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఇంత వడబోసినా పలు గ్రామాల్లో మరణించిన వారి పేర్లు ఉండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి గ్రామంలో 10 మంది వరకు మరణించినవారి పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు దృష్టిసారించి మరణించినవారి పేర్లు తొలగించాలని, అర్హుల పేర్లు చేర్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ వినోద్‌ను వివరణ కోరగా.. మరణించిన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉంటే బీఎల్వోలతో విచారణ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ఎన్నికల సమయం వరకు తుది ఓటరు జాబితా తయారు చేయిస్తామన్నారు.

క్లుప్తంగా

బావిలోపడి వృద్ధురాలి మృతి

పాలకుర్తి(రామగుండం): పుట్నూర్ గ్రామంలో అష్టకల శాంతమ్మ(90) సోమవారం బావిలోపడి మృతిచెందింది. స్థానికులు, పోలీసుల కథ నం ప్రకారం.. శాంతమ్మ తన చిన్న కుమారుడు మధుకర్ ఇంట్లో ఉంటోంది. రోజూ మాదిరిగానే అందరూ నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారు జామున లేచి చూసేసరికి కనిపించలేదు. తన ఇంటిసమీపంలోని సోదరుడు రవి ఇంటికి వెళ్లిఉంటుందని భావించారు. అక్కడా కనిపించలేదు. దీంతో పరిసరాల్లో వెతుకుతుండగా చేదబావి వద్ద శాంతమ్మ చేతికర్ర కనిపించింది. అనుమానంతో అందులో చూడగా మృతదేహం కనిపించింది. రాత్రివేళలో బహిర్భూమికి వెళ్లేందుకు యత్నించిన శాంతమ్మ.. ప్రమాదవశాత్తు బావి లో పడి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. ఈ మేరకు ఎస్సై స్వామి కేసు నమోదు చేసుకున్నారు. అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరి.. శాంతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ పంజాల మల్లయ్య(67) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఇరవై ఏళ్లుగా షుగర్ వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రుల చుట్టూ తిరిగినా వ్యాధి నయం కాలేదు. ఇన్‌ఫెక్షన్‌తో కుడికాలు తీసివేయాలని వైద్యులు సూచించడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసుదర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి..

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని బుట్టిరాజరాంకాలనీకి చెందిన శ్రీనివాస్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెయింటర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ప్రతిరోజూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం మద్యం సేవించి ఇంటికి వచ్చి నిద్రపోతానని చెప్పి బెడ్రూం గడియపెట్టుకున్నాడు. సాయంత్రం ఎంతపిలిచినా లేవకపోవడంతో అతని భార్య స్వప్న తన మరిది శ్రీకాంత్‌కు సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి తలుపు గడియ తెరిచి చూసేసరికి ఉరేసుకొని కనిపించాడు. ఈమేరకు మృతుడి భార్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన యువకుడు కటికరెడ్డి సుమంత్(24) చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. మద్యానికి బానిసైన సుమంత్ బైక్ ఈఎమ్‌ఐ చెల్లించలేక ఆదివారం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని, సుమంత్ పెద్దనాన్న సంపత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

తల్వార్‌తో విన్యాసాలు చేసిన వ్యక్తిపై కేసు

వెల్గటూర్/పాలకుర్తి : అమ్మవారి ఊరేగింపులో తల్వార్‌తో విన్యాసాలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు. ఈనెల 3న ముంజంపల్లిలో అమ్మవారి ఊరేగింపు చేపడుతుండగా.. బైరం హరీశ్ తల్వార్ తీసుకొచ్చి విన్యాసాలు చేసి అక్కడున్నవారిని భయభ్రాంతులకు గురిచేశాడు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు హరీశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

స్థానికంలో కాసుల గోల

- పెళ్లిళ్ల సీజన్.. బ్రాందీ షాపుల టెండర్లు
- రూ.50వేలకుపైగా ఉంటే సీజ్ చేస్తున్న పోలీసులు

స్వాధీనం చేసుకున్న సొత్తు

మంచిర్యాల జిల్లా:	
నగదు	రూ.4.48లక్షలు
లిక్కర్	146లీటర్లు(రూ.65వేలు)
పెద్దపల్లి జిల్లా:	
లిక్కర్	48లీటర్లు(రూ.17వేలు)
గంజాయి	5కిలోలు(రూ.1.25లక్షలు)
పీడీఎస్‌రైస్	క్వింటాల్



బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

చెక్‌పోస్టులు:
మంచిర్యాల జిల్లా:
పారుపల్లి(అంతర్‌రాష్ట్ర), ఇందన్‌పల్లి, ఇందారం, తాండూర్, గూడెం
పెద్దపల్లి జిల్లా:
దుబ్బపల్లి, గుంపుల, ఎక్లాస్‌పూర్, గోదావరి బ్రిడ్జి

గోదావరిఖని: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో పోలీసులు అప్రమత్తమైయ్యారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో పోలీసు బలగాలను మోహరించారు. నగదు ప్రవాహంపై దృష్టి సారించారు. రూ.50వేల కన్నా ఎక్కువ వెంట తీసుకెళ్తే కచ్చితమైన ఆధారాలు చూపించాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. లేకుంటే సీజ్ చేస్తామంటున్నారు. ఇదే క్రమంలో ఈనెల 4న రామగుండం పోలీస్ కమిషనరేట్ కోటపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంతర్‌రాష్ట్ర సరిహద్దు పారుపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.1.90లక్షలను సీజ్ చేశారు. మహారాష్ట్రలో ఎన్నికలు లేకపోవడంతో కోడ్ విషయం తెలియక కారులో ఓ వ్యక్తి నగదు తీసుకెళ్తున్నాడు. రూ.50వేల కన్నా ఎక్కువ తీసుకెళ్తుండడంతో సీజ్ చేశారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో చాలాజరుగుతున్నాయి.

పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఆందోళన..

పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం, వెండి, ఇతర విలువైన ఆభరణాల కొనుగోలు కోసం పెద్దమొత్తంలో నగదు అవసరం ఉంటుంది. పది గ్రాముల బంగారం కొనుగోలు చేయాలన్నా కనీసం రూ.1.20లక్షలు అవసరం అవుతోంది. ఈక్రమంలో నగదు వెంట తీసుకెళ్లడం తప్పనిసరి. కొంతమంది ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా కొనుగోలు చేస్తున్నా.. చాలామంది నగదు రూపేణా లావాదేవీలు జరుపుతున్నారు. ఈక్రమంలో పోలీసులు అధిక డబ్బులు తీసుకెళ్తున్నారని సీజ్ చేస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అసలు ఎన్నికలకు సంబంధించిన డబ్బులు చాపకింద నీరులా వెళ్తాయని, ఎన్నికల కమిషన్ అతి నిబంధనలతో తాము ఇబ్బందిపడాల్సి వస్తోందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రాందీ షాపుల టెండర్లు..

రాష్ట్రప్రభుత్వం బ్రాందీషాపుల టెండర్లను ప్రారంభించింది. రెండేళ్ల కాలపరిమితికి ఒక్కోషాపు వేలంలో పాల్గొనేందుకు రూ.3లక్షలు చెల్లించి డీడీ తీయాలని సూచించింది. దీంతో చాలామంది టెండర్లలో పాల్గొనేందుకు నగదు వెంట తీసుకెళ్లడం సహజం. స్థానిక ఎన్నికల కోడ్ కూసిన క్రమంలో తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈక్రమంలో పట్టణాల్లో మినహాయించి స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో ఈనిబంధన ఉండాలని కోరుతున్నారు.

నిబంధనలు పాటిస్తాం



ఎన్నికల నిబంధనల మేరకు వ్యవహరిస్తాం. నిబంధనలు అతిక్రమించి రూ.50వేలకుపైగా వెంట తీసుకెళ్తే అందుకు తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. లేకుంటే రూ.50వేల కన్నా ఎక్కువ ఉన్నసొమ్మును సీజ్ చేస్తాం. జిల్లా సరిహద్దులతోపాటు అంతర్ రాష్ట్ర సరిహద్దు అయిన కోటపల్లి మండలం శివారులోని మహారాష్ట్ర బ్రిడ్జి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశాం. నగదు, మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నాం.
– అంబర్ కిశోర్ ఝా, పోలీస్ కమిషనర్, రామగుండం



కోజాగరి పౌర్ణమి సందర్భంగా పాలలో చంద్రున్ని వీక్షిస్తున్న అర్చకులు, భక్తులు

ఘనంగా కోజాగరి పౌర్ణమి వేడుకలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో సోమవారం అర్ధరాత్రి కోజాగరి పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చంద్రుని పుట్టిన రోజు సందర్భంగా దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో దేవస్థానంలోని శేషప్ప కళావేదిక వద్ద అర్ధరాత్రి 12 గంటల అనంతరం గిన్నెలో పాలు పోసి పాలలో చంద్రున్ని వీక్షించారు.



కార్యక్రమంలో భాగంగా రాత్రి 9 గంటల నుంచి స్థానిక కళాకారులతో సంగీత విభావరి కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పాలల్లో చంద్రున్ని వీక్షించి పాలను తీర్థ ప్రసాదాలుగా స్వీకరించారు.





రాజన్నకు అభిషేకాలు

వేములవాడ: రాజన్నను సోమవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. గర్భగుడి దర్శనాలు రద్దుచేసిన ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ఈ సోమవారం అభిషేకాలు, అన్నపూజ, ఆకులపూజలకు అనుమతినిచ్చారు. రాజన్నను నిజామాబాద్ జిల్లాకు చెందిన అంతర్జాతీయ హాకీ ప్లేయర్ ఎండాల సౌందర్య దర్శించుకున్నారు. అర్చకులు స్వామి వారి ప్రసాదాలు అందించి సత్కరించారు. భక్తుల ఏర్పాట్లను ఈవో రమాదేవి, ఏఈవోలు, పర్యవేక్షకులు పరిశీలించారు.

స్థానిక ఎన్నికల్లో పొత్తు ఉండదు



మాట్లాడుతున్న యాసర్ అర్ఫాత్

విద్యానగర్(కరీంనగర్): ఎంఐఎం పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదని ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి యాసర్ అర్ఫాత్ స్పష్టం చేశారు. సోమవారం రాత్రి కరీంనగర్‌లోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని, పార్టీ అభ్యర్థుల విజయానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ సుబహాన్, నాయకులు బర్కత్ అలీ, హఫీజ్ యూసుఫ్, ఖమరొద్దీన్, ఆతిన, ఖాజా, ఇబ్రహీం, మాజీ కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, ఆరిఫ్ అహ్మద్, మాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌కు ఒడిశా పోలీసులు

కరీంనగర్‌క్రైం: సైబర్ క్రైం కేసులో ఒడిశా రాష్ట్రానికి చెందిన పోలీసులు సోమవారం కరీంనగర్‌కు వచ్చినట్లు తెలిసింది. కరీంనగర్ టూటౌన్ పరిధికి చెందిన కార్తీక్ అనే వ్యక్తి పాత్ర ఉందని భావించి అతను ఉంటున్న విద్యానగర్ ప్రాంతంలో దర్యాప్తు చేశారు. సైబర్ నేరస్తులు సామాన్యులకు కొంతడబ్బు ఇచ్చి వారి పేర్లపై ఖాతాలు తెరుస్తుండటంతో ఇలాంటి నేరంతో సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్న పోలీసులు అతడిని అక్కడికి తీసుకెళ్లినట్లు సమాచారం.

కుక్కల దాడిలో మహిళలకు తీవ్ర గాయాలు



మహిళ తలపై గాయం

మేడిపల్లి: భీమారం మండలం మన్నెగూడెంలో వాసం గంగు ఉదయం ఇంటి పనులు చేస్తుండగా.. ఓ కుక్క విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆమె తలపై తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వెంటనే జగిత్యాల ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. మేడిపల్లి, భీమారం మండలాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

- జగ్గాసాగర్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడి ఘటనలో..

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ సదానందంపై దాడి చేసిన ఘటనలో ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు చేపట్టారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా త్రీఫేజ్ సరఫరా చేయాలని మెట్‌పల్లి రూరల్ సెక్షన్ లైన్ ఇన్‌స్పెక్టర్ వినోద్ సదానందంకు సూచించగా.. ఉన్నతాధికారుల అనుమతి తీసుకుంటానని చెప్పడంతో ఇద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరిగి దాడి వరకు వెళ్లిన విషయం తెల్సిందే. దీంతో బాధితుడు సదానందం అదేరోజు పైఅధికారులతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన మెట్‌పల్లి ఏడీ అమరేందర్, ఏఈ రమేశ్ ఉన్నతాధికారులకు నివేదించారు. వారిచ్చిన నివేదిక ఆధారంగా లైన్‌ఇన్‌స్పెక్టర్ వినోద్‌ను సస్పెండ్ చేశారు.

వేములవాడలో కొండచిలువ



కొండచిలువను పట్టుకున్న జగదీశ్

వేములవాడ పట్టణ శివారులోని మూలవాగు తీరంలో ధోబీఘాట్ వద్ద 9 ఫీట్ల పొడవు ఉన్న కొండచిలువ సోమవారం కనిపించింది. దీన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ట్రాఫిక్ ఎస్సై రాజు అక్కడికి చేరుకుని పాములు పట్టే జగదీశ్‌కు సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి కొండచిలువను పట్టుకొని అటవీప్రాంతంలో వదిలిపెట్టారు. – వేములవాడ

'అడవిలో అన్నలు' సిరిసిల్లలో కలిశారు!



మంత్రి సీతక్కతో నాటి జనశక్తి దళానాయకులు సోమన్న, కుమార్

సిరిసిల్ల: సిరిసిల్లకు వచ్చిన మంత్రి సీతక్కను అప్పటి అన్నలు కలిశారు. ములుగు జిల్లాకు చెందిన ధనసరి అనసూర్య ఉరఫ్ సీతక్క 1985–92 ప్రాంతంలో సీపీఐ(ఎంఎల్) జనశక్తిలో దళనేతగా పనిచేశారు. అనంతరం ఆమె జనజీవన స్రవంతిలో కలిశారు. రాజకీయాల్లోకి వచ్చారు. ప్రస్తుతం మంత్రిగా పనిచేస్తున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం సిరిసిల్లకు వచ్చిన మంత్రిని జనశక్తి మాజీ నక్సల్స్ కోనరావుపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన బుర్ర మల్లేశంగౌడ్ ఉరఫ్ కుమారన్న, ఇదే మండలంలోని మల్కపేటకు చెందిన బుట్టం చంద్రయ్య ఉరఫ్ సోమన్న కలిశారు. గతంలో సీతక్కతో కలిసి పనిచేసిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. ఇది ఇలాఉంటే 1989లో గ్రెనేడ్ పేలి సోమన్న చేయి నుజ్జునుజ్జయ్యింది. అనంతరం వ్యక్తిగత కారణాలతో 1995లో ఆయన జనజీవన స్రవంతిలో కలిశారు. మరో నాయకుడు కుమారన్న వరంగల్ జిల్లాలోనే ఎక్కువ కాలం పనిచేశారు. 1989లో జనజీవన స్రవంతిలో కలిశారు. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ముష్టిపల్లి సర్పంచ్, ఉపసర్పంచగా పనిచేశారు.

యువకుడిపై దాడి



గాయపడిన రాజశేఖర్

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రం వెంకంపేట ప్రాంతంలో సోమవారం పాతపగలతో జరిగిన దాడి ఉద్రిక్తతకు దారితీసింది. స్థానికులు తెలిపిన వివరాలు. వెంకంపేటకు చెందిన రాజశేఖర్‌పై అదే పట్టణానికి చెందిన హరికృష్ణ, విగ్నేశ్, నరేశ్‌లు కర్రలతో దాడి చేశారు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దాడి చేయగా అడ్డుకునేందుకు ప్రయత్నించినా వినకుండా విచక్షణారహితంగా కర్రలతో కొట్టారు. తలపై గాయాలతో రక్తస్రావమైన రాజశేఖర్ వెంటనే హాస్పిటల్‌లో చికిత్స పొంది, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ దాడితో బాధితుని ఉండే ఏరియాలో నివసించే వారు భయాందోళన చెందుతున్నారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పంటలకు తెగుళ్ల బెడద

- ఎడతెరిపిలేని భారీవర్షాలు కారణం
- కోతదశకు వచ్చిన వరిపైరు
- మొగ్గ, పగిలే దశలో పత్తిపంట
- దిగుబడిపై తీవ్రప్రభావం
- లబోదిబోమంటున్న రైతులు



ఓదెల : మడకలో పత్తికి సోకిన తెగులు



సుల్తానాబాద్: ఎర్రగా మారిన వరిపైరు కాండం

సుల్తానాబాద్/జూలపల్లి/ఓదెల(పెద్దపల్లి): కొద్దిరోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో వరి, పత్తి పంటలకు తెగుళ్లు ఆశిస్తున్నాయి. వర్షాకాలం ఆరంభంలో ఆలస్యంగా కురిసిన వానలు.. ఇప్పుడు సీజన్ చివరిదశకు వచ్చినా భారీవర్షాలు కురుస్తుండడంతో పంటలు దెబ్బతింటున్నాయి. వీటికితోడు వాతావరణంలో ఆకస్మిక మార్పులతోనూ వరి, పత్తి పంటలకు వివిధ తెగుళ్లు ఆశిస్తున్నాయి. మరో నెలరోజుల్లో పంటలు చేతికి వస్తాయి. ఈ క్రమంలో తెగుళ్లు ఆశించడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీవర్షాలతో వరి పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. గింజదశలోని పంటను ఆశించడంతో దిగుబడి తగ్గుతుందని, అంతేకాకుండా తాలు అధికంగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతలను ముంచిన భారీ వర్షాలు

జూలపల్లి మండలంలోని కోనరావుపేట, నాగులపల్లె, కల్లెంరెడ్డిపల్లె, తెలుకుంట తదితర గ్రామాల్లోని వరిపంట కోతదశకు చేరింది. గింజగట్టిపడక ముందే ఏకధాటివానలతో తాలుగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగులపల్లె, తెలుకుంట, కల్లెంరెడ్డిపల్లెలో వర్షం ధాటికి దాదాపు 30 ఎకరాల్లో వరిపైరు నేలవాలిందని, గింజలు పనికిరాకుండా పోయాయని వాపోతున్నారు.

తెల్లబంగారానికి తెగులు..

ఓదెల మండలంలోని వివిధ గ్రామాల్లో పత్తి పంటకు తెగులు సోకింది. మచ్చతెగుళ్లతో పంట దెబ్బతింటోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓదెల మండలంలోని 22 గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారని అధికారుల అంచనా. ఇందుర్తిలో 250 ఎకరాలు, పొత్కపల్లిలో వెయ్యి , శానగొండలో 500, గుంపులలో 350, ఓదెలలో 570, కొమిరలో 320, కొలనూర్‌లో 200, మడకలో దాదాపు 250 ఎకరాల్లో పత్తి సాగైందని, కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటకు నల్లమచ్చలు వస్తున్నాయని, మొక్కలు కుళ్లిపోతున్నాయని అన్నదాతల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చే దశలో ఉందని, ఈ సమయంలో కాయలు, బుగ్గలు నల్లగా మారడంతో దిగుబడి తగ్గుతుందని, పెట్టుబడి చేతికి వచ్చే పరిస్థితి లేదంటున్నారు. మరోవైపు.. చేను జాలువారి మొక్కలన్నీ ఎర్రబారుతున్నాయని అంటున్నారు.

ఏఈవోలను సంప్రదించాలి

కొద్దిరోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలతోనే పత్తి పంటకు తెగులు సోకుతోంది. మొక్కలు, ఆకులు, కాయలపై నల్లమచ్చలు ఏర్పడుతున్నాయి. తెగుళ్ల నివారణ కోసం అన్నదాతలు రైతువేదికలో ఏఈవోలను తక్షణమే సంప్రదించాలి.
– రామకృష్ణ, ఏఈవో, కొలనూర్, ఓదెల

ప్రభుత్వం ఆదుకోవాలి



మరో పదిహేను రోజుల్లో వరి పంట కోతకు వస్తుంది. ఈ సమయంలో భారీ వర్షాలు పడుతున్నయి. నాకున్న మూడెకరాల్లో ఏసిన పంటకు నష్టం జరిగింది. పంట నష్టపోయిన మాలాంటి రైతులను ప్రభుత్వమే ఆర్థికంగా ఆదుకోవాలి.
– భూసారపు శ్రీనివాస్, రైతు, కోనరావుపేట

కాయలు నల్లబడ్డాయి



నాకున్న మూడెకరాల్లో ఈ సారి పత్తి పంట ఏసిన. ఏకరాపై రూ.30వేల చొప్పున పెట్టుబడి పెట్టిన. పత్తి పంట కాయ దశకు వచ్చింది. ఏకధాటి వానలతో వైరస్ సోకిందట. కాయలు నల్లగా, ఆకులు ఎర్రగా మారినయి.
– ఉప్పుల అనిత, రైతు, గూడెం

సూచనలు పాటించాలి

వాతావరణంలో వస్తున్న మార్పులు, భారీవర్షాలతోనే తెగుళ్లు ఆశిస్తున్నాయి. వాటి నివారణకు వ్యవసాయాధికారుల సూచన ప్రకారమే పురుగు మందులు వాడాలి. ఇందుకోసం స్థానిక ఏఈవోలను తప్పకుండా సంప్రదించాలి.
– శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి

రెండోసారి పిచికారీ



నాకున్న రెండెకరాల్లో వరి ఏసిన. మెడవిరుపు పురుగు సోకడంతో ఒకసారి పురుగుల మందు కొట్టిన. భారీవానలతో పైరు ఎర్రబడుతంది. అగ్గితెగులు సోకిందంటున్నరు. అధికారుల సూచనతో మరోసారి మందు కొడుతున్న.
– గెల్లు శ్రీనివాస్, రైతు, సుల్తానాబాద్